

ఘనంగా సయ్యద్ సాహెబ్ దర్గా ఉర్సు

నవాబుపేట, ఏప్రిల్ 26 : మండలంలోని ఎక్‌మామిడిలో శుక్రవారం హజ్రత్ సయ్యద్ సాహెబ్ హుస్సేన్ షా హీఖాద్రి దర్గా ఉర్సును ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి గంధోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎండీ.రఫీ, బీఆర్ఎస్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డితో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణను సన్మానిస్తున్న నారాయణరెడ్డి

ప్రజలకు ఉపయోగపడేలా సేవలందించాలి

వికారాబాద్, ఏప్రిల్ 26 : ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నత స్థానంలో ఉండి ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవలందించడం అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకొని వెళ్తున్న అమిత్‌నారాయణకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ క్యాడర్‌లో మంచి పోస్టింగ్ ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగిగా సర్వీస్ చేయడం అదృష్టమని, ప్రజలకు ఉపయోగపడేలా నిర్ణయాలుండాలని, ప్రభుత్వ ఉద్యోగిగా విధుల్లో చేరినప్పటి నుంచి ఉద్యోగ విరమణ పొందే వరకు అదే చిరునవ్వుతో పనిచేయాలన్నారు. అసోసియేషన్, మీడియా, ఉద్యోగులను కలుపుకొని ఫ్రెండ్లీగా విధులు నిర్వర్తించేలా ముందుకెళ్లాలని, సర్వీసుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులను చూసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ విషయంలో మంచి సేవలు అందించారని, ఇంకా ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని, జిల్లాను గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అమిత్‌నారాయణ మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏ సమస్య రాకుండా శిక్షణ పూర్తిచేసుకున్నానని, తాను మొదట ధారూర్ మండలం ఎంపీడీవోగా చేశానని, రెవెన్యూ సర్వీసు తెలుసుకోవడం, పోస్టల్ బ్యాలెట్ నిర్వహించడంతో మంచి అనుభవం వచ్చిందని, అందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు కొత్తగా ట్రైనీ కలెక్టర్‌గా వచ్చిన ఉమాహారతికి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలతో సాన్నిహిత్యాన్ని ట్రైనీ కలెక్టర్ గుర్తు చేసుకున్నారు.

ఎన్నికల విధులను సజావుగా నిర్వహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలను పాటిస్తూ విధులను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ప్రతీ నియోజకవర్గం వారీగా ఒక టీంను ఏర్పాటుచేసి ఓటరు జాబితా ప్రింట్లను గుర్తించిన రాజకీయ పార్టీల నాయకులకు అందజేయాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ చిరునామా కరెక్ట్‌గా ఉన్నాయా? లేదా? చెక్ చేసుకోవాలని, ఎన్నికల ప్రచార సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులు జారీ చేయాలన్నారు. ఓటరు స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలని, ఓటరు సమాచార స్లిప్పులు కుటుంబ సభ్యులకే అందజేసేలా చూడాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఫామ్-12కు సంబంధించి రెండు రోజుల్లో పూర్తిచేసి కవరింగ్ లేటర్లతో రిటర్నింగ్ అధికారికి అందజేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాల ఉద్యోగులకు ఓటరు స్పెషాలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్లాన్ చేయాలని, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, ఓపీవోలకు మాస్టర్ డైరీపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాలని, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు పకడ్బందీగా పనిచేయాలని, సి-విజిల్ పర్మిషన్లు తీసుకోవాలని, రాజకీయ పార్టీల వారు వీడియో, ఆడియో కంటెంట్‌కు సంబంధించి పెన్‌డ్రైవ్ ఇస్తే చెక్‌చేసి ఎంసీఎంసీ ద్వారా పర్మిషన్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో బేజారవుతున్నారు. మధ్యాహ్నం వడగాలులు, రాత్రి ఉక్కపోతతో బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6 వరకు జనం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఏదైనా పనిమీద బయటకు వెళితే శీతల పానీయాలు తప్పక తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. కాగా, అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయంటే మే నెలలో ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.



నిప్పుల కుంపటి!

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- మధ్యాహ్నం వడగాలులు, రాత్రి ఉక్కపోత
- ఉక్కిరిబిక్కిరవుతున్న చిన్నారులు, వృద్ధులు
- శేరిలింగంపల్లి, హఫీజ్‌పేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి : వైద్యులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26) :

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. రోహిణి కార్తెకు ముందే రోళ్లు పగిలేలా ఉష్ణోగ్రలు ఠారెత్తిస్తున్నాయి. వారం రోజుల నుంచి భానుడి ఉగ్రరూపానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులు పెరగడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగానే చేరాయి. మే నెల మధ్యలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఏప్రిల్ చివరి వారంలోనే రికార్డవుతున్నాయి. అనేకచోట్ల వడగాలులు, కొన్నిచోట్ల తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. ఫలితంగా జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టేందుకు జంకుతున్నారు. వడగాలులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఘన్‌పూర్‌లో శుక్రవారం అత్యధికంగా 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, హఫీజ్‌పేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తొర్మామిడి-నాగారంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, జనం ఎండ వేడిమికి చెట్లనీడను వెదకుతున్నారు. ఇంట్లో ఉక్కపోత భరించలేక చెట్ల కింద సేద తీరుతున్నారు. రాత్రి వేళలో ఫ్యాన్ల నుంచి వచ్చే వేడిగాలి భరించలేక ఆరుబయట పడుకుంటున్నారు. చిన్నపిల్లల, వృద్ధులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
26	43.5	43.1	43.4
25	42.4	41.1	42.9
24	42.6	41.5	42.8
23	42.9	42.5	43.3
22	42.9	42.5	43.3

ఎండ వేడిమికి జనం విలవిల

ఎండతో పాటు విపరీతమైన ఉక్కపోత, వడగాలుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగానే ఉన్నప్పటికీ శుక్రవారం నాటి ఎండకు జనం బెంబేలెత్తిపోయారు. ఎక్కడ చూసినా రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. వృద్ధులు, చిన్నారులు ఇళ్లలో ఉన్నప్పటికీ ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు.

మోగుతున్న ప్రమాద ఘంటికలు

వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఎండ తీవ్రతల ఆధారంగా ప్రమాదకర స్థాయిని అంచనా వేస్తారు. వేసవిలో 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే.. దానిని సాధారణంగా పరిగణిస్తారు. 35 నుంచి 40 డిగ్రీల వరకు మోస్తరు ఉష్ణోగ్రతలుగా గుర్తిస్తారు. జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. 40 నుంచి 45 డిగ్రీల వరకు ప్రమాదకరంగా భావిస్తారు. అప్రమత్తత అవసరం. ఇక 45 డిగ్రీలు దాటితే అత్యంత ప్రమాదకరంగా హెచ్చరికలు జారీ చేస్తారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుంటే మంచిది. బయటకు వెళ్లినా తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రమాదకర స్థితి ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఉష్ణోగ్రతలు పెరగడంతో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తరచూ నీటిని తాగుతుండాలని, ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకూడదు. శరీరాన్ని చల్లబరిచే పండ్లు, కూరగాయలు తీసుకోవాలని చెబుతున్నారు.



జోరుగా శీతల పానీయాల విక్రయాలు

వేడి తీవ్రత పెరిగిన నేపథ్యంలో కొబ్బరి బోండాలకు గిరాకీ బాగా పెరిగింది. పండ్ల రసాలు, శీతల పానీయాల దుకాణాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. మజ్జిగ విక్రయాలు గతంలో పోల్చితే రెండు రెట్లు పెరిగాయి. రహదారులపై శీతల పానీయాలు, సోడా, షర్బత్ దుకాణాలు పెద్దఎత్తున వెలిశాయి. జ్యూస్ కోసం పుచ్చకాయలు, ద్రాక్ష, అరటి పండ్లకు గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఎండ పెరిగిన నేపథ్యంలో క్యాప్(టోపీ)లకు కూడా డిమాండ్ పెరిగింది. మహిళలు గొడుగులతో రక్షణ పొందుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే మహిళలు, యువతులు స్కార్ఫ్‌లతో కళ్లకు రక్షణ కల్పిస్తున్నారు. చలువ అద్దాలు ధరిస్తున్నారు. పురుషులు కూడా తలకు నూలు వస్త్రం చుట్టి హెల్మెట్ ధరించడం ద్వారా కొంతవరకు ఉపశమనం పొందుతున్నారు.



మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లొద్దు

పెరుగుతున్న ఎండల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా పనులుంటే 10 గంటల్లోగా పూర్తి చేసుకోవాలి.. లేదంటే సాయంత్రం 5 గంటల తర్వాత చేసుకోవాలి. మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దు. ఎండాకాలం దూర ప్రయాణాలు మానుకోవాలి. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఎల్లప్పుడూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

9,83,740 జిల్లా ఓటర్లు

- అనుబంధ ఓటర్ల జాబితా విడుదల
- పార్లమెంట్ ఎన్నికలకు తేలిన ఓటర్ల లెక్క

వికారాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలకు ఓటు హక్కు వినియోగించుకునే జిల్లా ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలో 9,83,740 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం లెక్క తేల్చింది. జిల్లా అనుబంధ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 9,83,740 మంది ఓటర్లున్నట్లు ప్రకటించారు. వీరిలో సాధారణ ఓటర్లు 9,83,191 మంది, 549 సర్వీస్ ఓటర్లు ఉన్నారు. సాధారణ ఓటర్లలో 4,85,210 మంది పురుషులు, 4,97,946 మంది మహిళలు, 35 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అనుబంధ ఓటర్ల వివరాలను విడుదల చేశారు. జిల్లాలో కెల్లా పరిగి నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో, అత్యల్పంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఓటర్లు ఉన్నారు. పరిగిలో 2,66,819, వికారాబాద్‌లో 2,31,717 మంది ఓటర్ల చొప్పున ఉన్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి, కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి.



వికారాబాద్ జిల్లా ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
వికారాబాద్	4,85,748	4,97,957	35	9,83,740
నియోజకవర్గం	**పురుషులు**	**మహిళలు**	**థర్డ్‌జెండర్**	**మొత్తం**
పరిగి	1,33,818	1,32,992	09	2,66,819
వికారాబాద్	1,15,041	1,16,662	14	2,31,717
తాండూరు	1,17,872	1,25,365	07	2,43,244
కొడంగల్	1,19,017	1,22,938	05	2,41,960
మొత్తం	4,85,748	4,97,957	35	9,83,740
సాధారణ ఓటర్లు				
పరిగి	1,33,568	1,32,989	09	2,66,566
వికారాబాద్	1,14,965	1,16,660	14	2,31,639
తాండూరు	1,17,821	1,25,364	07	2,43,192
కొడంగల్	1,18,856	1,22,933	05	2,41,794
మొత్తం	4,85,210	4,97,946	35	9,83,191

జిల్లాలో తగ్గిన ఓటర్లు

2024 ఫిబ్రవరి 8న ప్రకటించిన ఓటర్ల జాబితాతో పోలిస్తే జిల్లాలో మరో 328 మంది ఓటర్లు తగ్గారు. జనవరి 6న ప్రకటించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 9,71,011 మంది ఉండగా, ఎస్ఎస్ఆర్ ప్రక్రియ అనంతరం ఓటర్లు 9,84,068 మందికి పెరిగారు. జనవరి 23 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు కొనసాగిన ఓటర్ల నమోదు, మార్పుల చేర్పులకు 10,342 దరఖాస్తులొచ్చాయి. కొత్తగా ఓటరు నమోదుకు 9,332, మార్పులకు 1,010 దరఖాస్తులందాయి. పరిశీలనానంతరం అర్హులను అనుబంధ జాబితాల్లో చేర్చారు. జనవరి 6న ప్రకటించిన ముసాయిదాతో పోలిస్తే జిల్లాలో 12,729 మంది ఓటర్లు పెరిగారు. ఆ తరువాత ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకున్నారు.



మూడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువ

వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో పురుషుల కంటే 1,621 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. తాండూరులో పురుషుల కంటే 7,493 మంది, కొడంగల్ నియోజకవర్గంలో పురుషుల కంటే 3,921 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కాగా పరిగి నియోజకవర్గంలో మాత్రం పురుష ఓటర్లు ఎక్కువ మంది ఉన్నారు. ఇక్కడ మహిళల కంటే 826 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

సర్వీసు ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
పరిగి	250	03	253
వికారాబాద్	76	02	78
తాండూరు	51	01	52
కొడంగల్	161	05	166
మొత్తం	538	11	549



మెట్లకుంట కేంద్రం వద్ద వడ్ల తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఎం సుగుణాబాయి, డీఎస్‌వో రాజేశ్వర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై కలెక్టర్ సీరియస్

- ప్రక్రియ వేగం పెంచాలని అధికారులకు ఆదేశం
- కేంద్రాలను పరిశీలించిన సివిల్ సప్లయీస్ అధికారులు
- జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం
- కొనుగోళ్లు ముమ్మరం
- రైతులను ఇబ్బందులు పెడితే ఏజెన్సీలపై చర్యలు
- పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణాబాయి

పరిగి, ఏప్రిల్ 26: 'ధాన్యం కొనేదెప్పుడు?' శీర్షికన వరి రైతుల ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆంధ్రజ్యోతి కథనంలో ప్రస్తావించిన అంశాలపై ఆరాతీశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై అధికారులపై ఆయన సీరియసయ్యారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్.సుగుణాబాయి, అధికారి రాజేశ్వర్, తదితరులు పరిగి, బొంరాస్‌పేట్ మండలాల్లో పర్యటించారు. మెట్లకుంట, బొంరాసిపేట్, నాగిరెడ్డిపల్లి, పరిగి కేంద్రాల్లో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పోసిన వడ్ల కుప్పలను పరిశీలించారు. మేనేరజర్ సుగుణాబాయి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లాలో వివిధ ఏజెన్సీల ద్వారా 129వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ధాన్యం ఎఫ్ఏక్యూ నిబంధనలకు మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్ ద్వారా ప్రాసెస్ చేసుకునేందుకు అవకాశచ్చామని తెలిపారు. జిల్లాలో 12.4లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. శుక్రవారం నుంచే జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యాయన్నారు. 29లక్షల గన్నీ బ్యాగులు అవసరముండగా, కేంద్రాల్లో 15లక్షల బ్యాగ్‌లు ఉన్నాయని చెప్పారు. మరో 6లక్షల బ్యాగ్‌లకు ఆర్డర్లు ఇచ్చామని, రెండు రోజుల్లో అవసరం మేరకు గన్నీ బ్యాగులొస్తాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. తూకం మిషన్లు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, లైటింగ్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఏ కేంద్రంలో అయినా బ్యాగులు చిరిగిపోయినా వాటి స్థానంలో కొత్తవి ఇస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు వడ్లు కాంటా పెట్టిన వారంరోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- చేవెళ్లలో 17 నామినేషన్ల తిరస్కరణ
- బరిలో 47 మంది అభ్యర్థులు
- మల్కాజ్‌గిరి స్థానంలో 77 నామినేషన్ల తిరస్కరణ
- 37 మంది నామినేషన్ల ఆమోదం

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. అధికారులు నామినేషన్ల పరిశీలన పూర్తిచేశారు. సరైన ఫార్మాట్‌లో లేని నామినేషన్లను తిరస్కరించారు. దాంతో బరిలో నిలిచేది ఎవరో తేలిపోయింది. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి మొత్తం 64 అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, పార్లమెంట్ స్థానానికి దాఖలైన నామినేషన్లలో 17 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 47 నామినేషన్లకు జిల్లా ఎన్నికల అధికారి శశాంక అమోదం తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లకు ఓకే చెప్పారు. ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నారు.

మల్కాజ్‌గిరిలో భారీగా నామినేషన్ల తిరస్కరణ



మేడ్చల్, (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ముగిసింది. మల్కాజ్‌గిరి నియోజవర్గానికి 114 మంది అభ్యర్థులు 177 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతం ఆధ్వర్యంలో జరిగిన స్ర్కూటినీలో 77మంది నామినేషన్లు తిరస్కరించడగా 37 అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించినట్లు ఎన్నికల పరిశీలకులు రాజీవ్‌శుక్లా తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు


ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 26: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎందరో ప్రయాణికులను రోజూ సురక్షితంగా, క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లపై కొందరు ప్రయాణికులు అసహనానికి గురై దాడులకు పాల్పడిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నట్లు గుర్తుచేశారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడినా, లేక బెదిరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే 100కు ఫోన్‌చేయాలని సూచించారు.

జానపద కళాకారుడికి ఉగాది పురస్కారం

● ఢిల్లీలో ఈ నెల 29న ప్రదానం


అశోక్

తాండూరు, ఏప్రిల్ 26: తాండూరుకు చెందిన ఫైన్ ఆర్ట్స్ కల్చర్ అకాడమి అధ్యక్షుడు, జాతీయస్థాయి జానపద కళాకారుడు ఎల్. అశోక్‌కు ఉగాది పురస్కారం వరించింది. ఈనెల 29న(సోమవారం) దేశరాజధాని ఢిల్లీలోని లోక్ కళామంచ్‌లో శిఖరం ఆర్ట్స్ అకాడమి హైదరాబాద్ సంస్థ 2024వ సంవత్సరంకిగాను జానపద విభాగంలో జాతీయ స్థాయి పురస్కారం అందుకోనున్నారు. తనకు పోత్సాహం అందించిన విఠల్ నాయక్, గూళి శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాల పరిశీలన



బొంరాస్‌పేట్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26: వరి ధాన్యం కొనుగోళ్లను జిల్లా అధికారులు దగ్గరుండి ప్రారంభించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన ధాన్యం కొనుగోలు చేసేదెన్నడో అనే కథనానికి స్పందించిన అధికారులు బొంరాస్‌పేట్, మెట్లకుంట తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను పరిశీలించారు. పౌరసరఫరాల జిల్లా అధికారిణి నాగమణి, రాజేశ్వర్‌లు బొంరాస్‌పేట్ మండలంలో ధాన్యం తూకాలు వేయించారు. బొంరాస్‌పేట్, కొత్తూర్, దుప్‌చర్ల, చౌదర్‌పల్లి, చిలుముల్ మైలారం, లగచర్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు 5వేల చొప్పున గన్నీ బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏర్పుమళ్ల గ్రామానికి సమీపంలో గల రైస్‌మిల్లు నుంచి గన్నీ బ్యాగులు కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ కేంద్రంలో తేమ శాతం 17 ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. బొంరాస్‌పేట్‌లో బస్తాలు తూకం వేసేంత వరకు పరిశీలించి వెళ్లారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఏపీయం కిష్టప్ప, సిబ్బంది మల్లికార్జున్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

వికారాబాద్, ఏప్రిల్ 26: పాలిటెక్నిక్, కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వికారాబాద్ జిల్లా పాలిసెట్ కోర్డినేటర్, ప్రిన్సిపాల్ ఎం. పరమేశ్వర్ తెలిపారు. వచ్చేనెల 24వ తేదీన ప్రవేశపరీక్ష ఉన్న నేపథ్యంలో వికారాబాద్ పాలిటెక్నిక్, కళాశాలలో మేనెల 1నుంచి 21వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మరోసారి ఎంపీగా అవకాశం కల్పించండి: రంజిత్‌రెడ్డి



తాండూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలో భాగంగా బైకులు నడిపిస్తున్న రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 26: వేలకోట్లు ఉన్నా ప్రజాసేవ చేయలేని వ్యక్తి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటువేసి అమూల్యమైన ఓటును వృథా చేసుకోవద్దని సూచించారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ గెలిస్తే ఉచిత పథకాలు ఇవ్వదన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్లకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వేల కోట్లు ఉన్నా ప్రజలకు సేవ చేయలేదన్నారు. కరోనా సమయంలో ప్రజలను ఆదుకోలేదన్నారు. అంతెందుకు తన అపోలో ఆస్పత్రిలో ఒక్కరూపాయి బిల్లు కూడా తగ్గించలేదని దుయ్యబట్టారు. మరోసారి చేవెళ్ల ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరు అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను నమ్మి గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉన్నానని, వారికి సేవ చేసుకుంటానని అన్నారు. ఎన్నికల తర్వాత తాండూరు అభివృద్ధిపై దృష్టి సారిస్తానని అన్నారు. జూన్ 4 తర్వాత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, రేషన్ కార్డు, కొత్త పెన్షన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తంచంద్ పాల్గొన్నారు.

తాండూరులో భారీ బైక్ ర్యాలీ

తాండూరు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరులోని విలియమూన్ చౌరస్తా నుంచి సాయిపూర్ వరకు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు అనేవి మన పిల్లల భవిష్యత్తుపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. మతతత్వ పార్టీలు ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రజలు వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, మాజీ ఎంపీపీ కర్ణం పురుషోత్తంరావు పాల్గొన్నారు.

అమూల్యమైన ఓటు కాంగ్రెస్‌కే వేయాలి

వికారాబాద్: ప్రజలు తమ అమూల్యమైన ఓటు కాంగ్రెస్‌కే వేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వ సుజాత, సుధాకర్‌రెడ్డి, విశ్వనాథం సత్యనారాయణ, మురళి, మాలే గాయత్రి లక్ష్మణ్, మోముల స్వాతి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరు మండలం చీలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నేడు యాలాల మండలంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మహలింగపూరం గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు ఆయన సమక్షంలో శంకర్‌పల్లి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపాల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లావాడ, జాలగూడ గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం చేశారు. అదేవిధంగా నేడు రంగారెడ్డి జిల్లా కందుకూరులో రంజిత్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ జంగారెడ్డి తెలిపారు. అదేవిధంగా సరూర్‌నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు బేరే బాలకిషన్, పారుపల్లి దయాకర్‌రెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, ఆల్విన్ కాలనీలో జరిగిన ప్రచారంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్‌తో కలిసి ధరణినగర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, బాలస్వామి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

ఈనెల 30, మే 5 న మహేశ్వరంలో సీఎం పర్యటన

మహేశ్వరం, ఏప్రిల్ 26 : చేవెళ్లలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30, మే 5న మహేశ్వరం నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కెఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు స్వయంగా సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రంగంలోకి గిగుతున్నారని చెప్పారు. అందుకోసం ఈనెల 30, మే 5న నియోజకవర్గంలోని మీర్‌పేట, బడంగ్‌పేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, తుక్కుగూడ, కందుకూరుల్లో సీఎం రోడ్‌షోతో పాటు కార్నర్ మీటింగ్‌లు ఉంటాయన్నారు. సీఎం రోడ్‌షోలను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల అనంతరం కేంద్రంలో కూడా కాంగ్రెస్‌దే అధికారమని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిగిలోని ఏఆర్‌వో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ రాజీవ్‌చోప్ర

ఏఆర్‌వో కార్యాలయం సందర్శన

పరిగి, ఫిబ్రవరి 26: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ రాజీవ్‌చోప్రా శుక్రవారం పరిగిలోని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఏఆర్వో ఎం.వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్‌లతో సమావేశమయ్యారు. అనంతరం సోషల్‌మీడియా కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల వివరాలు గురించి అరా తీశారు. ఎన్నికల ఖర్చుల బృందాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల ఖర్చుల వివరాల్లో తప్పులు లేకుండా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి వివరాలు సేకరించాలని సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట భద్రత



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీపీ

ఆమనగల్లు, ఏప్రిల్ 26 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో, సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి చెప్పారు. శుక్రవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని జంగారెడ్డిపల్లి, సాలార్పూర్, ఎక్వాయిపల్లి, మంగళపల్లి, కడ్తాల్, మైసిగండి, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని చెప్పారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా తాము తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్సైలు వరప్రసాద్, బాల్‌రాంనాయక్ తదితరులున్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట, ఏప్రిల్ 26 : గ్రామ పంచాయతీ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మేడే వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, హమాలీ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాలను తీసుకరావాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, మండలాధ్యక్షుడు జంగయ్య, రవి, యాదయ్య, నరసింహ, స్వాతి, సురేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కాలురామ్‌రావత్

వికారాబాద్, ఏప్రిల్ 26 : ఎన్నికలు గట్టి నిఘా, బందోబస్తుల మధ్య ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల పోలీస్ పరిశీలకులు కాలురామ్ రావత్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గం మేరీ ఏనాట్ పాఠశాలలో ఈవీఎం, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మలతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ భద్రతకు విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని పలకరించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన కాలురామ్ రావత్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్, వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ పుష్ప గుచ్ఛాలతో స్వాగతించారు. స్ట్రాంగ్‌రూమ్ సందర్శనలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంలు తప్పవా?

మల్కాజ్‌గిరిలో అంచనాకు మించి నామినేషన్లు



మేడ్చల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మల్కాజిగిరి నియోజకవర్గానికి ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో ఎన్నికల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మల్కాజిగిరి స్థానానికి నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16 మంది అభ్యర్థుల పేర్లు పొందుపర్చవచ్చు. అంతకు ఎక్కువ మంది ఉంటే అదనపు ఈవీఎంలు ఏర్పాటు చేయాలి. ఒక కంట్రోల్ యూనిట్‌కు 51 ఈవీఎంలను అనుసంధానించొచ్చు. ప్రస్తుతం మల్కాజిగిరినియోజకవర్గానికి 16మందికి మించకపోవచ్చని అధికారులు భావించారు. ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఏకంగా 138మంది నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. ఉపసంహరణకు గడువు 29 వరకు ఉంది. చివరకు పోటీలో ఉండేది ఎంత మంది అనే విషయం తేలుతుంది. 16 మందికి మించి ఎంత మంది ఉంటే ఆ మేరకు అదనపు బీయూలను ఏర్పాటు చేస్తారు. అయితే ఎన్నికల సంఘం ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కోబ్యాలెట్ యూనిటే పంపింది. అభ్యర్థుల సంఖ్య ఎక్కువుంటే మళ్లీ అవసరమైన బ్యాలెట్ యూనిట్లు తెప్పించి ర్యాండమైజేషన్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఉపసంహరించుకోకుంటే మళ్లీ పని మొదటికి వచ్చినట్లేనని అధికారులు తల పట్టుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

సమన్వయంతో పనిచేద్దాం

- తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు, ఏప్రిల్ 26: తాండూరు శ్రీభావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు వివిధ శాఖలో అధికారులు సహకరించాలని తాండూరు ఆర్డీవో శ్రీనివాస రావు కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులు, దేవాదారు శాఖ అధికారులు, దేవాలయ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 30 నుంచి వచ్చే 8 వరకు జాతర బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఉత్సవాల్లో రథోత్సవం, లంకదహన ఘట్టాలు ప్రధానమైనని, ఈ ఉత్సవాలను తిలకించేందుకు వేల మందిగా తరలివచ్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్డీవో కోరారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ అశోక్‌కుమార్, టౌన్ సీఐ సంతోష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, విద్యుత్ శాఖ ఏడీ ఆదినారాయణ, ఫైర్ అధికారి నాగార్జున పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి

- మళ్లీ ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా
- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మొయినాబాద్ : అజీజ్‌నగర్‌లో సంకల్ప పత్రాన్ని విడుదల చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రజల అభివృద్ధి కోసం పార్లమెంటులో గతంలో వందసార్లు సమస్యలను లేవనెత్తినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో బీజేపీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ప్రజల కోసం ప్రణాళికతో చేసిన సంకల్ప పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డితో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ అడుగుజాడల్లోనే మోదీ సర్కారు పనిచేస్తోందని అన్నారు. విపక్షాలు చేస్తున్న లేనిపోని ఆరోపణలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. గతంలో తాను ఎంపీగా పనిచేసినపుడు హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకై కేంద్రం నుంచి రూ. 930 కోట్లు విధులు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. నేటికి పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. తాను ఎంపీగా గెలిచిని తరువాత రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించి పూర్తి చేస్తానని హామీనిచ్చారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద చేవెళ్లకు లక్ష ఇళ్లను తీసుకువస్తానని హామీఇచ్చారు. అభివృద్ధి చేయకపోవడంతోనే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాడని పరోక్షంగా విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, చేవెళ్ల ఆసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, తూళ్ల వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్, పాపయ్యగౌడ్, అంజన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీకి మూడోసారి అధికారం ఖాయం: కిషన్‌రెడ్డి

కందుకూరు : ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేత మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిట్ట రాజేందర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు కిషన్‌రెడ్డి సమక్షంలో నగరంలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలో చేరినవారిలో టంకరి మధుసూదన్ రెడ్డి, కె.మోహన్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, ఎస్ దేవేందర్‌రెడ్డి, కె.వినోద్‌రెడ్డి, కె.విక్రంరెడ్డి, డి.శ్రీశైలం, కె.ప్రకాశ్‌రెడ్డిలు ఉన్నారు.

ఓబీసీ మహా సమ్మేళనానికి తరలిరావాలి

మొయినాబాద్ రూరల్ : బీజేపీ ఓబీసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు కంజర్లమాల్‌లో నిర్వహించే బీసీ సామాజిక మహాసమ్మేళన సభకు నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని జిల్లా అధ్యక్షుడు దుద్దెల్ల లక్ష్మీనారాయణ, జిల్లా కన్వీనర్ ఎల్లని వెంకటేష్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో శుక్రవారం వారు విలేకరులుతో మాట్లాడారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ముందుకు సాగాలని బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని కేసారం, పామెన, చేవెళ్ల గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

బీజేపీకి మరో అవకాశం కల్పించాలి

ధారూరు : దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను నేరుగా పేదలకు అందిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ నాయకులు ఓటర్లను కోరారు. ఎబ్బనూర్, బాచారం గ్రామాల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమేశ్, వివేకానందర్‌రెడ్డి, పాండుగౌడ్ పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

మోమిన్‌పేట్: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అమ్రాది కుర్దు, అమ్రాదికలాన్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారు

కులకచర్ల: ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం రాబోతోందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి తెలిపారు. చెల్లాపూర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నర్సింహారెడ్డి, జీ.మహిపాల్, కె.మహిపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దోమ, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 2000-2001లో పదోతరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులు స్థానిక ఎస్‌జీ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించి 22 సంవత్సరాలు గడుస్తుందని, కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో, మరి కొంత మంది వ్యాపార రంగంలో రాణించడం గర్వంగా ఉందని ఉపాధ్యాయులు అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న దోమ మాజీ సర్పంచ్ కె.రాజిరెడ్డిని విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, ప్రమోద్‌రెడ్డి, గోవింద్, శ్రీనివాస్, గీతారెడ్డి, భ్రమరాంబ, హుసేన్, శివశంకర్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మురళీధర్

కులకచర్ల, ఏప్రిల్ 26: ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. మండలంలోని కామునిపల్లి, బండవెల్కిచర్ల, పీరంపల్లి, కులకచర్ల గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కులకచర్ల మండలంలో మొత్తం 36,276 మంది ఓటర్లు ఉండగా 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకార్యాల్లో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్



వధూవరులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, ఏప్రిల్ 26: మండలంలో శుక్రవారం జరిగిన పలు శుభకార్యాలకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ధారూరులో వడ్ల జగదీశ్వర్, బోయిని అన్నమయ్య, నాగసమందర్‌లో ప్రవీణ్ వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కెరెల్లిలో నూతన గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

వివాహాది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కులకచర్ల: తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తన సొంత గ్రామం కులకచర్ల మడంలంలోని తిరుమలాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఓ వివాహాది వేడుకలో పాల్గొన్నారు. గ్రామానికి ఎందిన వార్ల రాంచంద్రయ్యగౌడ్ కూతురు అనూష వివాహం జరిగింది. ఈ వేడుకలో ఆయన పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టాస్ పరీక్షా కేంద్రాల తనిఖీ

వికారాబాద్, ఏప్రిల్ 26: జిల్లాలో గురువారం ప్రారంభమైన ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నాలుగు కేంద్రాల్లో ఎస్ఎస్సీ, ఐదు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఎస్ఎస్సీ ఇంగ్లీష్ పరీక్షకు 524 మందిని కేటాయించగా వారిలో 462 మంది హాజరయ్యారు. 62 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు 88.16శాతం హాజరు నమోదైంది. ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు 792 మంది కేటాయించగా 695మంది హాజరు కాగా, 95మంది గైర్హాజరయ్యారు. 87.75 శాతం హాజరు నమోదైంది. కాగా మధ్యాహ్నం జరిగిన ఇండియన్ కల్చర్ అండ్ హెరిటేజ్ పరీక్షకు 128మందివి కేటాయించగా వారిలో 109మంది హాజరు కాగా, 19మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ సోషియాలజీ పరీక్షకు ఐదుగురు అభ్యర్థులకు ముగ్గురు హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. తాండూరులోని టాస్ పరీక్షా కేంద్రాలను డీఈవో రేణుకాదేవి తనిఖీ చేయగా, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రాంరెడ్డి వికారాబాద్‌లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రెండవ రోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

మద్దతు ధర కల్పనకే కొనుగోలు కేంద్రాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 26 : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అరుణకుమారి సందర్శించారు. ధాన్యం కొనుగోలును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి 17తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి పద్మాకర్‌రెడ్డి, రైతు నాయకులు రామస్వామి, పద్మానాయక్, లక్ష్మి, యాదయ్య, నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

దేశాన్ని పాలించే సత్తా మోదీకే ఉంది

● ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

బాలానగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దేశాన్ని పాలించే సత్తా మోదీకి మాత్రమే ఉన్నదని, బీజేపీని గెలిపించి మూడో సారి ఆయనను ప్రధాన మంత్రిని చేయాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం బాలానగర్ డివిజన్ శ్రీశ్రీనగర్, ఇందిరానగర్, బాలానగర్, వినాయకనగర్, ఫిరోజ్‌గూడా బస్తీల్లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు మహిళా మోర్చా నాయకురాళ్లు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. బాలానగర్ అభయాంజనేయ స్వామి, కనకదుర్గా ఆలయంలో ఈటల ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ కోర్టు అడ్వకేట్లను ఈటల కలిసి వారి మద్దతు కోరారు. బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు, శివరంజని, రూప, నర్సిరెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.



బాలానగర్: ప్రజలకు అభివాదం చేస్తున్న ఈటల రాజేందర్

ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

అల్వాల్, (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్, వెంకటాపురం డివిజన్‌లో ఆయన నాయకులు,కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిలర్ నిమ్మ కృష్ణారెడ్డి, చింతల మాణిక్యారెడ్డి, శేఖర్, రవికిరణ్, లక్ష్మణ్, మురళీ, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మంగళ హారతులతో ఈటలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఈటలకు మద్దతుగా బేతి ప్రచారం

కాప్రా, (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శుక్రవారం హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో ప్రచారం నిర్వహించారు. కైలాసగిరి, రాజీవ్‌నగర్, ఇందిరానగర్, నవోదయనగర్‌లో ఆయన పాదయాత్ర చేసి కరపత్రాలను అందజేశారు. కమలం గుర్తుకు ఓటు వేసి ఈటెల రాజేందర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎనుముల మహేష్ పాల్గొన్నారు.

ఇందిరానగర్‌ల ఈటల జమున ప్రచారం

రామంతాపూర్, (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ డివిజన్ ఇందిరానగర్‌లో బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన సతీమణి ఈటల జమున కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈటలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, నాయకులు జగదీష్, బాలకృష్ణగౌడ్, వెంపాటి శ్రీనివాస్, మంగాగౌడ్, అంబటి భాగ్యలక్ష్మి వీణ పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపనలు



స్వామి వార్లను దర్శించుకుంటున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కీసర రూరల్, ఏప్రిల్ 26: నాగారం మున్సిపాలిటీ పరిధి శిల్పానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు ఆంజనేయులుగౌడ్, కౌకుంట్ల అనంతరెడ్డిల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గత మూడు రోజులకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో మూడోరోజు అనురాధ నక్షత్రం, కర్కట లగ్న పుష్కరాంశ సుముహూర్తాన వేంకటేశ్వరుడు, శివలింగం, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠాపనను నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి తంతును నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివార్ల దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, దేవాదాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పూజారి సుబ్బణ్ణ, సుదర్శన్ గ్రామపెద్దల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు విగ్రహ స్థాపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు వేకువజామున వేద పండితుల మంత్రోచ్చరణలతో స్వామివారిని మేలుకొల్పారు. ఆలయ సన్నిధిలో హోమం, ప్రత్యేకపూజలతో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు, వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



ఎక్మాయిలో ప్రతిష్ఠించిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

దేవాదాయ భూములను ఆక్రమిస్తే చర్యలు

బషీరాబాద్, ఏప్రిల్ 26: దేవాదాయ శాఖ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా ఈవో(ఎండోమెంట్ అధికారి) తాడెం నరేందర్ హెచ్చరించారు. మండలంలోని ఎక్మాయి గ్రామంలోని మారుతి దేవాలయం భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆలయానికి సంబంధించి సుమారు 13 ఎకరాల భూమిని అక్రమణకు ప్రయత్నిస్తున్నారనే గ్రామస్తుల ఫిర్యాదుపై ఆయన ఇక్కడికి వచ్చారు. గ్రామ శివారులోని ఆలయ భూములను కలియ తిరిగి అక్కడున్న కమిటీ నిర్వహకులు, గ్రామ పెద్దలతో చర్చించారు. త్వరలో ఆలయ భూములకు సంబంధించి నోటీసులు జారీ చేసి పంట సాగు కోసం వేలం వేస్తామన్నారు. రైతులు వేలంపాటలో దక్కించుకొని దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం సాగు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. దేవాలయ భూముల్లో ఎవరైనా కబ్జాకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బి.వెంకటరెడ్డి, ఎస్.సుదర్శన్, పి.క్రిష్ణా, ఎం.దుశ్యాంత్‌రెడ్డి, టి.వెంకటయ్య, ఎం.మధుసూదన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎక్మాయి శివారులో మారుతి దేవాలయ భూములను పరిశీలిస్తున్న ఈవో నరేందర్, గ్రామపెద్దలు

పట్టుదలతో చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్, 26: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అవుషాపూర్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ రెండు సంవత్సరాలు కష్టపడి చదివినప్పుడే పై చదువులకు పునాది గట్టిగా ఏర్పాడుతుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ చదువాలని, ముఖ్యంగా సమయపాలన పాటించాలని గుర్తుచేశారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అక్షయ్, అరుణ్, జీషాన్, గురుచరణ్, వంశీ, ఝాన్సీ, జోగేశ్వర్, నిఖిల్‌లకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26: కొడంగల్‌లోని అన్నారం, టేకుల్‌కోడ్, నాగారం, పాటిమీదిపల్లి, ప్యాలమద్ది, చిన్ననందిగామ, హస్నాబాద్, ఇందనూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు చేయి గుర్తుపై ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, గోవర్ధన్, భీమ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, సంతోష్, భాస్కర్ పాల్గొన్నారు. బొంరాస్‌పేట్‌లోని వడిచర్ల, తుంకిమెట్ల, దుప్‌చర్ల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లతో అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, వెంకటయ్య, హనీఫ్, గోపాల్‌రెడ్డి, నారాయణగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, ఏప్రిల్ 26: వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పదోతరగతి పాఠాలు బోధించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వేసవి సెలవులు ఉన్నా పాఠశాలలు నడుపుతున్న స్కూళ్లను శుక్రవారం మూసివేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన కార్పొరేట్ పాఠశాలలు మాత్రం వారి సొంత లాభాల కోసం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. వికారాబాద్ కలెక్టర్ స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ టౌన్ సెక్రటరీ మహేష్ జాయింట్ సెక్రెటరీ జగదీష్‌చారి, ఆది కేశవరెడ్డి, మురళి, ప్రణీత్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుదాం

కొడంగల్, ఏప్రిల్ 26: రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందామనే నినాదంతో శనివారం సాయంత్రం 4 గంటలకు మహబూబ్‌నగర్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, రాజ్యాంగ రక్షణ కమిటీ తాలూకా కన్వీనర్ రేగడిమైలారం శ్రీనివాస్, మండల కన్వీనర్‌లు ఏర్పుల మోహన్, జగన్‌మోహన్, నవాజ్ తదితరులు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభలో వక్తలు ప్రొఫెసర్‌లు కాశీం, హరగోపాల్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న అంబేద్కర్ సంఘం నాయకులు, రాజ్యాంగ రక్షణ కమిటీ సభ్యులు

మోసానికి ఒడిగట్టిన నలుగురికి జరిమానా

ఆమనగల్లు, ఏప్రిల్ 26: మోసానికి పాల్పడిన నలుగురు వ్యక్తులకు ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఆమనగల్లు ఎస్సై బాల్‌రాం నాయక్ తెలిపారు. నగరంలోని చంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ సయ్యద్ 2020లో ద్విచక్రవాహనం పోయిందని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కాగా, పాత సామాన్ల వ్యాపారం చేసుకునే ఆమనగల్లు పట్టణానికి చెందిన ముజాహిద్ గుర్తుతెలియని వ్యక్తి నుంచి 2021లో ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేశాడు. దానిని అప్సర్‌కు విక్రయించగా, అతను సిల్వేరు ప్రేమ్‌కుమార్, వసంత, సహాయంతో వాహనాన్ని రంగు, నెంబర్ ప్లేట్ మార్చి తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని చంద్రాయణగుట్టలో మిస్సింగ్ అయిన అబ్దుల్ సయ్యద్‌దిగా గుర్తించి కేసు నమోదు చేసి ఛార్జిషీటు వేశారు. రంగు, నెంబర్ ప్లేటు మార్చడం నేరంగా భావించిన కోర్టు సదరు వ్యక్తులకు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్ట్



ఎక్సైజ్ పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న యువకులు

వికారాబాద్, ఏప్రిల్ 26: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాగవీణ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్‌గౌడ్ ఆదేశాల మేరకు వికారాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో శుక్రవారం తనిఖీలు చేయగా వికారాబాద్‌లోని గంగారం గ్రామానికి చెందిన సాయికుమార్, అరుణ్ కుమార్‌లు గంజాయి విక్రయించడాన్ని గుర్తించినట్లు తెలిపారు. వీరు బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారని విచారణలో వెల్లడైందని చెప్పారు. గంజాయి అమ్మడంతో నిందితులు వాటికి బానిసలు అయ్యారని, వారి వద్ద నుంచి 465 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది శివప్రసాద్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో అశోక్ ఖార్వాన్, రాజ్‌కుమార్ కరావర్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారివద్దకు వెళ్లి విచారించగా, వారి వద్ద రెండు కేజీల గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అశోక్, రాజ్‌కుమార్‌లను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



అనంతయ్య(ఫైల్)

ధారూరు, ఏప్రిల్ 26: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాగారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముసలిగళ్ల అనంతయ్య(42) ఇల్లు సరిగ్గా లేకపోవటంతో నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఈ ఇంటి నిర్మాణం నిమిత్తం గ్రామంలోని తనకు తెలిసిన వారి వద్ద దాదాపు రూ.2లక్షల వరకు అప్పులు తీసుకువచ్చాడు. ఈ అప్పులను తీర్చడం ఎలా అని తరచూ మదనపడేవాడు. అప్పుల భారంతో జీవితంపై విరక్తి చెందిన అనంతయ్య ఈనెల 22న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. తానే స్వయంగా వెళ్లి తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అనంతయ్య మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్



హత్యకు పాల్పడిన నిందితులను చూయిస్తున్న సీఐ, ఎస్సై

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26: వివాహేతర సంబంధానికి భర్త అడ్డొస్తున్నాడని కట్టుకున్న భార్యే ప్రియుడితో కలిసి దారుణానికి ఒడిగట్టింది. మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన నర్సింహులు హత్య కేసులో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనా వివరాలను కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈనెల 12న కొత్తూర్ గ్రామానికి చెందిన నర్సింహులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య సుమలత అదే గ్రామానికి చెందిన మొహ్మద్ బాబాతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. భర్త అడ్డు తొలగించుకోవడానికి మొహ్మద్ బాబాతో కలిసి హత్య చేసేందుకు పథకంపన్నారు. మహ్మద్ బాబా స్నేహితుడు పూడూర్ గ్రామానికి చెందిన ఖాసీంకు రూ.5లక్షలు సుపారీ ఇచ్చారు. ఈ క్రమంలో బొలేరో వాహనంతో యాక్సిడెంట్ చేయించినా నర్సింహులు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈనెల 11న తన ఇంట్లో నిద్రిస్తుండగా భార్య సుమలత, బాబా, ఖాసీంలు కలిసి ఊపిరాడకుండా చేసి నర్సింహును హతమార్చారు. ఎవరూ రాకుండా కుమారుడు ఆకాశ్‌ను కాపలా ఉంచారు. మరుసటి రోజు నర్సింహులు మృతిపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడిందన్నారు. శుక్రవారం నిందితులు సుమలత, బాబా, ఖాసీం, ఆకాశ్‌లను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

● కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 26: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మన్ మూసాపేట్‌లో ఉంటూ ఎలక్ట్రిషన్‌గా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూవారి కూలిలాగే తూంకుంట మున్సిపాలిటీలోని అంతాయిపల్లి గ్రామపరిధిలోని జనచైతన్య వెంచర్‌లో మూడు రోజులుగా మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్‌లో పనిచేస్తున్నాడు. ఒక ఎల్‌సీ ఫీడర్ నుంచి సప్లయి ఇవ్వాల్సిపోయి మరో ఎల్‌సీ ఫీడర్ నుంచి సప్లయి తీసుకోగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రమాదవశాత్తు లక్ష్మణ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై శామీర్‌పేట్ ఏడీఈ రమణరెడ్డిని వివరణ కోరగా తనకేం తెలియదని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని సమాధానమిచ్చారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

కొత్తూర్, ఏప్రిల్ 26 : మండల కేంద్రానికి సమీపంలో గల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గురువారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. దాదాపు 45సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని ఓ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు బ్లూకలర్ జీన్స్‌ప్యాంట్, బ్లాక్ కలర్ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ అనుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9848090426 సెల్ నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన చెప్పారు.